క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్ : నియోజకవర్గంలోని గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని టీడీపీ ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మండలంలోని అన్ని శాఖలకు సంబంధించిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలను ఇబ్బంది పెట్టకుండా అధికారులు పని చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దామోదర్‌రెడ్డి, ఈఓఆర్డీ సంజన్న, సెబ్ సీఐ సీతారాంరెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వాలు విఫలం

నంద్యాల(న్యూటౌన్): ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం పట్టణ కార్యదర్శి నరసింహులు, సీనియర్ నాయకులు తోటమద్దులు అన్నారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ధరలను నియంత్రిస్తామని ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చాక ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, మరోవైపు నిత్యావసర, కూరగాయల ధరలు పెరిగిపోవడంతో అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ధరలను అదుపు చేయాలని కోరారు. గౌస్, లక్ష్మణ్, శివ, వీరసేన పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను వినియోగించుకోండి



ఖాతాదారులతో మాట్లాడుతున్న నాగనాయక్

నంద్యాల(అర్బన్): పోస్టాఫీసు సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ నాగనాయక్ తెలిపారు. పోస్టాఫీసుల్లో ఖాతాదారులకు అందుతున్న సేవలపై బుధవారం మండలంలోని పోలూరు గ్రామ సబ్ పోస్టాఫీసులో ఎస్‌బీఎం అలీసాతో కలిసి ఆర్‌పీఎల్‌టీ, పీఎల్‌టీ, ఎస్ఎస్ఏ తదితర పాలసీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో అత్యంత నమ్మదగిన పాలసీల సంస్థల్లో పోస్టాఫీసు నమ్మకమైనదన్నారు. ప్రతి ఖాతాదారుడు ఆత్మవిశ్వాసంతో పాలసీలు చేసి పోస్టాఫీసుల అభివృద్ధికి పాటు పడాలని కోరారు.

యువతకు ఆదర్శం ఛత్రపతి శివాజీ

నంద్యాల(వ్యవసాయం): నేటి యువత ఛత్రపతి శివాజీ ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సేవా భారతి కర్నూలు విభాగ్ రఘురాములు పేర్కొన్నారు. హిందూ సంప్రదాయ దినోత్సవం, శివాజీ పట్టాభిషిక్తుడైన రోజును పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ శివాజీ పోరాట స్ఫూర్తి, బుద్ధి కుశలత, పరిపాలన దక్షత, ధైర్యసాహసాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవ చేయాలని కోరారు. స్వయం సేవక్ సంఘ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం

నంద్యాల(న్యూటౌన్): జంప్‌రోప్ క్రీడాకారుడు రిషిక్ నాగేష్ ఈ ఏడాది జపాన్‌లో జరిగే పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గోవాలో నిర్వహించే శిక్షణకు వెళ్తుండటంతో డాక్టర్ రామకృష్ణారెడ్డి బుధవారం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. పీవీ సుబ్బారెడ్డి, సుధాకర్, కాటసాని శ్రీనివాసరెడ్డి, తిమ్మయ్య, రమణ, యోగా మాస్టర్ రమేష్ ఉన్నారు.

స్థానికతపై అధికారుల సర్వే



ఇంటింటి సర్వే చేస్తున్న అధికారులు

కొత్తపల్లి: మండల పరిధిలోని నీటిముంపు బాధితులైన వారి స్థానికతపై బుధవారం సిద్దేశ్వరం, బలపాలతిప్ప, జానాలగూడెంలలో అధికారులు సర్వే చేపట్టారు. కర్నూలు ఇరిగేషన్ డిప్యూటీ ఇంజినీర్ గీతాలక్ష్మి, కర్నూలు కలెక్టరేట్ ఇరిగేషన్ ఏఈ విజయకుమార్‌రెడ్డి ఇతర శాఖల అధికారుల బృందంతో ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించారు. రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ఓటరు కార్డులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ నీటిముంపు భూముల సమస్యపై స్థానికులు, స్థానికేతరుల మధ్య భూ వివాదం ఏర్పడడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ సర్వే చేస్తున్నామన్నారు. స్థానికతపై చేసిన సర్వే నివేదికలు జిల్లా ఉన్నతాధికారులకు పంపుతామని, తదుపరి చర్యలు ఉన్నతాధికారులు తీసుకుంటారని చెప్పారు.

మాన్యాలున్నా.. అభివృద్ధి సున్నా

- జూపాడు సమీపంలోని ఆలయాలకు 40 ఎకరాల మాన్యం
- నిర్వహణ లోపంతో 12 ఎకరాలు బీడు
- భూముల వేలం ద్వారా ఏటా రూ. లక్షల్లో ఆదాయం
- కూలేందుకు సిద్ధంగా ఉన్న శ్రీఆంజనేయస్వామి ఆలయ ధ్వజస్తంభం
- పునర్నిర్మాణానికి నోచుకోని వైనం



ఆంజనేయస్వామి ఆలయం ఎదుట శిథిలమైన చెక్క ధ్వజస్తంభం

జూపాడుబంగ్లా: దేవాలయాల మాన్యం భూములున్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల అభివృద్ధికి నోచుకోవడంలేదు. భూముల వేలం ద్వారా ఏటా రూ.లక్షల ఆదాయం సమకూరుతున్నా ఆలయాలను పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. అంతేకాకుండా భూములను పట్టించుకోకపోవడం వల్ల కొన్ని బీడుగా మారుతున్నాయి.

రూ.లక్షల విలువ చేసే భూములు..

మండలంలోని 80బన్నూరు సమీపంలోని జూపాడు వద్ద ఈశ్వర, చెన్నకేశవ, శ్రీఆంజనేయస్వామి ఆలయాలున్నాయి. వీటికి ఎకరా పొలం రూ.15 నుంచి రూ.40లక్షల విలువచేసే 40 ఎకరాల మాన్యం భూములున్నాయి. అలాంటి భూములను దేవదాయశాఖ అధికారులు పర్యవేక్షించాల్సి ఉండగా వారి నిర్లక్ష్యవైఖరి వల్ల విలువైన 12ఎకరాల భూముల్లో కంపచెట్లు మొలచి బీడుగా మారడంతో వాటి ద్వారా రావాల్సిన ఆదాయానికి గండిపడింది. మిగిలిన భూముల కౌలు వేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని కైంకర్యం చేస్తూ అధికారు ఆలయాల అభివృద్ధిని విస్మరిస్తుండటంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏటా రూ.2లక్షలు పైబడి ఆదాయం

ఆయా దేవస్థానాల మాన్యం భూములను ఏటా కౌలుకు వేలం వేయడం ద్వారా రూ.2లక్షలకు పైబడి ఆదాయం సమకూరుతోంది. ఐదేళ్ల క్రితం వరకు 40ఎకరాల భూములను కౌలుకు వేలం వేయటం ద్వారా రూ.5లక్షల వరకు ఆదాయం సమకూరేది. ప్రస్తుతం 12ఎకరాల భూములను బీడుగా ఉంచటంతో కౌలు ఆదాయం కొంత మేర తగ్గింది. దీనికితోడు కౌలు వేలాలు అధికంగా పోతే అధికారులు తక్కువగా చూపిస్తూ నిధులను పక్కదారి మళ్లిస్తున్నారనే విమర్శలున్నాయి.

అన్య మస్తులకు కౌలు

దేవదాయశాఖ చట్టంలోని జీవో.ఎంఎస్.నెం .426(ఎండోమెంటు-1) తేదీ 09-11-2015 ప్రకారం దేవాలయాల మాన్యం భూముల కౌలు వేలం పాటల్లో ఇతర మతస్తులు పాల్గొనరాదు. ఒకవేళ వారు పాల్గొన్నా మాన్యం భూములు కౌలుకు ఇవ్వరాదు. అయితే నిబంధనలకు వ్యతిరేకంగా వారం క్రితం జరిగిన ఆలయాల మాన్యం భూముల వేలంలో పాటల్లో ఇతర మతస్తులు పాల్గొననివ్వడంతో పాటు వారికి ఆలయాల మాన్యం భూములను దేవదాయశాఖ అధికారులు కౌలుకు కట్టబెట్టారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

శిథిలమైన ఆలయాల ధ్వజస్తంభాలు

ఈశ్వర, ఆంజనేయస్వామివార్ల ఆలయాల ముందున్న ధ్వజస్తంభాలు చెదలుపట్టి, పెచ్చులూడిపోయి అప్పుడో ఇప్పుడో కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఆలయాల ముందున్న ధ్వజస్తంభాలు కూలితే అరిష్టమని తెలిసినా దేవదాయశాఖ అధికారులు కొత్తవి ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు ఆలయాల చుట్టూ కనీసం ప్రహరీడ, ఫెన్సింగ్ లేకపోవడంతో కేజీ రోడ్డు పక్కన ఉన్న ఆలయాల్లో నిత్యం దొంగలు దోపిడీకి పాల్పడుతున్నారు.



అభివృద్ధికి నోచుకోని జూపాడులోని ఈశ్వర ఆలయం

ఆదాయం తక్కువగా ఉంది

జూపాడు లోని ఈశ్వర, చెన్నకేశవ, ఆంజనేయ స్వామివార్ల దేవస్థానాలకు 40ఎకరాల మాన్యం భూములుండగా అందులో 12ఎకరాలు బీడుగా ఉండటం వల్ల ఆదాయం తగ్గింది. ఈ ఏడాది 12ఎకరాలను సాగులోకి తెచ్చేందుకు ఉచితంగా కౌలుకు ఇచ్చాం. మరో రెండేళ్ల తర్వాత శిథిలమైన ఆలయాల స్థానంలో రాతి ధ్వజస్తంభాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

\- కార్తీక్, ఈఓ, దేవదాయశాఖ

నిర్మాణానికి నోచుకోని సత్రం

జూపాడులో ఆలయాలు వెలసి సుమారు 150 ఏళ్లయినా ఇప్పటికీ ఆలయాల వద్ద ఒక్క సత్రం కూడా నిర్మాణానికి నోచుకోలేదు. జూపాడు శ్రీఆంజనేయస్వామి వారు ఎంతో మహిమాన్వితంగా ఉండటంతో శనివారం రాత్రి స్వామివారి చెంతన నిద్రిస్తే రోగాలు మాయమవుతాయనేది భక్తుల నమ్మకం. ఈ నమ్మకంతో స్వామివారి దర్శనానికి కర్నూలు, ఆత్మకూరు, నందికొట్కూరు, పగిడ్యాల, నంద్యాల తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వస్తుంటారు. రాత్రి వేళల్లో సరైన వసతిలేకపోవటంతో ఆరుబయటే నిద్రిస్తుంటారు.



బీడుగా మారిన ఆలయాల మాన్యం భూమి

నకిలీలు విక్రయిస్తే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ ఫణీశ్వరరెడ్డి

పాములపాడు: నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే దుకాణాల యజమానులపై చర్యలు తప్పవని ఏఓ ఫణీశ్వర రెడ్డి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రమైన పాములపాడులోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. బాలాజీ ఆగ్రోఏజెన్సీస్ దుకాణంలో హరిలాల్ సీడ్స్, విఠల్ 3456 రకం, హరితసీడ్స్ వారి వీఎంహెచ్ 125 రకం విత్తనాల శాంపిల్స్ తీశారు. వీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపనున్నట్లు ఏఓ తెలిపారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. దుకాణాలకు మంజూరైన స్టాక్, సెల్స్ లకు సంబంధించిన రికార్డులు పక్కాగా నమోదు చేయాలన్నారు. రైతుల ఆధార్ నంబర్, సంతకాల్లేకుండా ఏదేని విక్రయించినా సదరు దుకాణదారునిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

విధుల్లోకి తీసుకోండి

జూపాడుబంగ్లా: తమను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలంటూ రాజీనామా చేసిన గ్రామ వలంటీర్లు కోరారు. ఈ మేరకు మండలంలోని మండ్లెం, తూడిచెర్ల, పారుమంచాల గ్రామాల వలంటీర్లు బుధవారం ఎంపీడీఓ నూర్జహాన్‌ను కలిసి తమ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు వెలువడనందున తాము వలంటీర్లకు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోలేమన్నారు. ప్రభుత్వం నుంచి ఏదైన ఉత్తర్వులు జారీ అయితే దానికి అనుగుణంగా తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అప్పటి వరకు వేచిఉండాల్సిందేనని వలంటీర్లకు సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశానికి హాజరైన గర్భిణులు, బాలింతలు

పగిడ్యాల: వర్షకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి మోహన్ అన్నారు. బుధవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసరాలల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. వర్షాలకు భూగర్భ జలాలు కలుషితమై ప్రాణాంతక వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. తాగునీటిని కాచి, చల్లార్చి తాగాలన్నారు. జ్వరం, తలనొప్పి, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. అలాగే ప్రాణాంతకమైన డయేరియా, మలేరియా, అతిసారం, చికెన్‌గున్యా రోగాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమకాటుకు గురికాకుండా ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడుకోవాలన్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు నిల్వ ఉండే వర్షపునీరు తాగరాదని, ఇంటి నుంచి స్వచ్ఛమైన నీటిని తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త గుండమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు తదితరులు ఉన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు

యోగాపై అవగాహన ర్యాలీ

శ్రీశైలంప్రాజెక్ట్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం డిగ్రీ కళాశాల విద్యార్థులు సున్నిపెంట గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 'నిత్యం యోగా చేయడం వలన ఆయుస్సు కాలాన్ని పెంచుకోగలుగుతామని, ఆరోగ్యవంతమైన శరీరాన్ని కలిగి ఉంటామని' విద్యార్థులు నినాదాలు చేశారు. ర్యాలీలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, మహిళా సాధికారక సభ్యులతో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం.బుచ్చయ్య, అధ్యాపకులు డాక్టర్.కె.రాజన్న, డాక్టర్.ఎం.పద్మ, డాక్టర్.శివనాగిరెడ్డి, మహేశ్వరరెడ్డి, బాలు, పూర్ణేశ్వరరెడ్డి, శర్మ, షాహిదా, కళ్యాణి, షామ్మ తదితరులు పాల్గొన్నారు.

31.02 మి.మీ. వర్షపాతం నమోదు

పగిడ్యాల: మండల వ్యాప్తంగా బుధవారం తెల్లవారుజామున కురిసిన వర్షం 31.02 మి.మీ. నమోదైనట్లు తహసీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. గత పదిహేను రోజులుగా వర్షం జాడ కనిపించకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వర్షాధారం కింద మెట్ల పొలాల్లో వేసిన మొక్కజొన్న పైర్లు వానలు లేక వాడబారాయి. తెల్లవారుజామున కురిసిన వర్షంతో పైర్లు ఊపిరిపోసుకుని తెప్పరిల్లడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

మిడుతూరులో వర్షం

మిడుతూరు: మండలకేంద్రమైన మిడుతూరుతో పాటు పీరుసాహెబ్ పేట, కడుమూరు, మాసపేట, చెరుకుచెర్ల, చింతలపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆయా గ్రామాల్లోని రైతులు తమ పొలాల్లో విత్తనాలు విత్తుకునేందుకు సిద్ధమయ్యారు. 10 రోజుల క్రితం పొల్లాలో విత్తనాలు నాటుకున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలకేంద్రంలో 16.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

కొత్తపల్లిలో 10.5 మి.మీల వర్షపాతం నమోదు

కొత్తపల్లి: మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారు జాము వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. గువ్వలకుంట్ల, వీరాపురం, నందికుంట, దుద్యాల, కొక్కెరంచ, గోకవరం, సింగరాజుపల్లె, గుమ్మడాపురం, ముసలిమడుగు, ఎర్రమఠం గ్రామాలతో పాటు కొత్తపల్లి మండల కేంద్రంలో 10.5 మి.మీల వర్షపాతం నమోదు అయ్యింది. గత పదిరోజులుగా వర్షం కోసం వేచి చూస్తున్న రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది. ఖరీఫ్ సాగుకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

హైస్కూల్‌లో విలీనాన్ని ఉపసంహరించుకోవాలి



ఎంఈఓలకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కొత్తపల్లి: దుద్యాల స్పెషల్ స్కూల్‌లోని 1 నుంచి 5 తరగతులను హైస్కూల్‌లో విలీనాన్ని ఉపసంహరించుకోవాలని స్థానిక స్పెషల్‌స్కూల్ పీఎంసీ మాజీ చైర్మన్ ఈ.రాజు డిమాండ్ చేశారు. బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి ఎంఈఓలు శ్రీరాములు, ఇనాయతుల్లాలకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ దుద్యాల గ్రామంలోని ప్రభుత్వ స్పెషల్ స్కూల్‌లో 1 నుంచి 5 వతరగతి వరకు జరిగే తరగతులను హైస్కూల్‌లో విలీనం చేయడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. ఎస్సీకాలనీ నుంచి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చిన్నారులు రావాలంటే కిలోమీటర్ కన్నా ఎక్కువదూరం ఉందన్నారు. పాఠశాలకు వెళ్లేటప్పుడు రోడ్డుపై ఆటోలు, బైకులు, బస్సులు ఇతర వాహనాలు తిరుగుతుంటాయని, దీంతో పిల్లలకు ఎపుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. ఈ పరిస్థితి క్షుణ్ణంగా అధికారులు పరిశీలించి, 1 నుంచి 5వ తరగతి వరకు స్పెషల్ స్కూల్‌లోనే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఎ.ఓబులేసు, ఇ.అశోక్, వెంకటేశ్వర్లు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షిగణపతికి విశేష పూజలు



జ్వాలా వీరభద్రస్వామి



సాక్షిగణపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షిగణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

పండ్ల తోటలతో రైతుల అభివృద్ధి



మాట్లాడుతున్న ఏపీఓ రేష్మ

కొత్తపల్లి: పండ్ల తోటలతో రైతుల అభివృద్ధి సాధ్యమవుతుందని, రైతులు పండ్ల పెంపకం చేసుకునేలా అవగాహన కల్పించాలని ఏపీఓ రేష్మ సూచించారు. బుధవారం స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, హౌసింగ్ శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పండ్లతోటలను పెంచుకోవడంతో రైతులు ఎలా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్న విషయాలను రైతులకు ఫీల్డ్ అసిస్టెంట్లు వివరించాలని చెప్పారు. మండలంలో ఇప్పటిదాకా 157 ఎకరాల్లో పండ్లతోటల పెంపకానికి రైతులు ముందుకు వచ్చారన్నారు. ఇందులో 16 రకాల పండ్ల మొక్కలను ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రైతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. మామిడి, జామ, సపోట, నేరేడు, నిమ్మ, ఆరెంజ్, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, మల్లెపూలు, డ్రాగన్ ఫ్రూట్, మునగ, రోజ్, ఆపిల్‌బేర్, అంజీర పండ్ల తోటలు పెంచుకునేందుకు అవకాశం ఉందన్నారు. 5 ఎకరాలలోపు ఉండే రైతులు ఎవరైనా మండల ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో 3,4 రోజులలో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. అదేవిధంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా హౌసింగ్ శాఖలో కూలీలకు కల్పించే 90 రోజుల పనిదినాలను ఆశాఖ సిబ్బంది త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్.ఆర్.శ్రీవాణి

శ్రీశైలంప్రాజెక్ట్: మానవుని శరీరంలోని క్రమపద్ధతిలో లేని ఎర్రకణాలతో శరీరం రోగాల మయమవుతుందని డాక్టర్.ఆర్.శ్రీవాణి విద్యార్థులకు వివరించారు. గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాలలో బుధవారం సికిల్ సెల్ అనీమియాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్లు ఆర్.శ్రీవాణి, షెహనాజ్ మాట్లాడుతూ.. సాధారణంగా జన్యుపరమైన లోపాల వలన ఈవ్యాధి సంక్రమిస్తుందని, రక్తంలోని హిమోగ్లోబిన్, ఆక్సిజన్ క్రమాన్ని సికిల్ సెల్స్ నాశనం చేస్తాయన్నారు. ఈ వ్యాధి సోకినవారిలో రక్తహీనత, నొప్పులు, కాళ్లవాపులు, రక్తం గడ్డకట్టుకు పోవడం, తరుచూ జ్వరం బారిన పడడం జరుగుతుంటుందన్నారు. వయసును బట్టి, ఇమ్యునిటీ పవర్ తగ్గడం వలన అన్ని ఆర్గాన్స్ దెబ్బతింటాయని తెలిపారు. రక్త పరీక్ష ద్వారా ఈ వ్యాధిని గుర్తించవచ్చని వెల్లడించారు. ఈ వ్యాధి సోకిన వారు పరిశుభ్రమైన నీటిని సేవించాలని, ఫోలిక్ యాసిడ్స్ కలిగిన ఆహార పదార్థాలు, టాబ్లెట్లు తీసుకోవాలని, పొగతాగడం మానుకోవాలని, తగినంతగా వ్యాయామం చేయాలని, అతివృష్టి, అనావృష్టి వాతావరణంలో ఉండరాదని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్.ఎస్.జి.కిషోర్‌బాబు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎస్‌కె.షాహీన్, ఆశా నోడల్ ఆఫీసర్ ఎం.సుభాషిణి, ఏఎన్‌ఎం జె.భాగ్యలక్ష్మి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఈ లక్షణాలతో జాగ్రత్తగా ఉండండి

మహానంది: రక్తకణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్ర ఒళ్లు, కీళ్ల నొప్పులు లాంటి లక్షణాలు ఉంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తిమ్మాపురం పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ హుసేన్‌రెడ్డి సూచించారు. మహానందిలో గిరిజన ఆశ్రమపాఠశాలలో బుధవారం సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పై లక్షణాలు ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ఏఎన్‌ఎంలను విధుల్లోకి తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): అర్బన్ హెల్త్ కేర్ సెంటర్లలో ఏఎన్‌ఎంలుగా పనిచేస్తున్న తమను తిరిగి విధులలోకి తీసుకోవాలని ఏపీ పట్టణ ఆరోగ్య కేంద్రాల కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ కమిటీ అధ్యక్షురాలు దేవమ్మ, కార్యదర్శి బుజ్జమ్మ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. 2016లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టణ ఆరోగ్యకేంద్రాలను అపోలో ఏజెన్సీలకు అప్పగించారన్నారు. హెల్త్ కేర్ సెంటర్లలో పనిచేస్తున్న తమను ప్రభుత్వం డీఎం అండ్‌హెచ్‌ఓ ద్వారా ఏజెన్సీలకు అప్పగించిందన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఏజెన్సీల గడువు ముగియడంతో ఉద్యోగాలు అగమ్యగోచరంగా తయారయ్యాయని వాపోయారు.

ప్రశాంతంగా ఆలయ భూముల వేలం పాటలు

మహానంది: బుక్కాపురంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన భూముల కౌలుకు వేలం పాటలను బుధవారం ఆలయం వద్ద ఈఓ స్వర్ణముఖి, గ్రూపు దేవాలయాల ఈఓ జనార్దన్‌శెట్టి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించారు. సుమారు 29 ఎకరాల భూముల కౌలు కోసం బహిరంగ వేలాలు నిర్వహించారు. అందులో 15 వరుస నెంబర్లలోని విస్తీర్ణం కలిగిన భూముల్లో జరిగిన సుమారు 15 ఎకరాల భూముల ద్వారా రూ.4,46లక్షలు ఆదాయం వచ్చింది. మరికొన్ని ఎకరాలకు వాయిదా పడ్డాయి. గతేడాది అన్ని భూముల ద్వారా రూ. 4,32,000 వచ్చింది. వాయిదా పడిన భూములకు ఎంతో డిమాండ్ ఉందని, అయితే వాటిని తగ్గించి తీసుకునేందుకు పలువురు ప్రయత్నాలు చేస్తున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా మిగిలిన భూములు వారం రోజుల్లో వేలాలు నిర్వహిస్తామని ఈఓ స్వర్ణముఖి చెప్పారు. అయితే వేలాలకు రావద్దని, ఘర్షణలు జరుగుతాయని కొందరు ఈఓకు సూమాచారమివ్వడం చర్చనీయాంశమైంది. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్, సిబ్బంది చంద్రశేఖర్, పీరయ్య బందోబస్తు నిర్వహించారు.

వేలాల్లో పెరిగిన ఆదాయం

మహానంది: బండిఆత్మకూరు మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ, జనార్ధన, ఆంజనేయస్వామి ఆలయాలకు చెందిన భూముల కౌలు వేలాల ద్వారా రూ.9.38లక్షలు ఆదాయం లభించినట్లు ఈఓ ఏ.నాగప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలో ఆలయానికి చెందిన 37.14 ఎకరాల భూములకు బుధవారం వేలాలు నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ గతేడాది భూముల ద్వారా రూ.4,26,500 రాగా ఈ ఏడాది రూ.9,38,000 వచ్చిందన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది రూ. 5,11,500 ఆదాయం పెరిగినట్లు చెప్పారు. అలాగే శింగవరం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర, ఆంజనేయస్వామి దేవస్థానాలకు చెందిన భూముల వేలం పాటలను వాయిదా వేశామని, జూన్ 27వ తేదీన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రూపు దేవాలయాల ఇన్‌స్పెక్టర్ శశికుమార్, సిబ్బంది నాగరాజు, అర్చకులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



వేలాలు నిర్వహిస్తున్న ఈఓ స్వర్ణముఖి, బందోబస్తులో పోలీసులు

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలో దేవాలయాల మాన్యం భూముల వేలం పాటలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. గ్రామంలోని ఈశ్వర, ఎల్లమ్మ, కేశవ, రామచంద్రాంజనేయ స్వామివార్ల ఆలయాల మాన్యం భూములు 113.82 ఎకరాలకు ఈఓ ఏడి.వెంకటరమణ అధ్వర్యంలో బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. వేలం పాటల్లో 66 మంది రైతులు రూ.2వేల ధరావత్తు చెల్లించి వేలం పాటల్లో పాల్గొన్నారు. మాన్యం భూములను వేలం వేయగా రూ.17.20లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి రామలింగారెడ్డి, సిబ్బంది నారాయణ, ధీరజ్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.